మీరు ఉత్తములు కారు!

క్యాబినెట్‌లో కట్టప్ప!

- సీనియర్ మంత్రిపై ముఖ్యనేత రుసరుస
- ముఖ్యనేత ఉచ్చులో పడ్డ కాంగ్రెస్ పాత నేత
- అసలైన హస్తం పార్టీ నాయకుడిపై 'కోవర్టు' ముద్ర
- కాళేశ్వరంపై బీఆర్ఎస్‌కు సహకరిస్తున్నారంటూ గుస్సా
- వ్యతిరేక పార్టీ ఎంపీని పురమాయించారని ఆరోపణలు
- క్యాబినెట్ మీటింగ్‌కు ముందు ముఖ్యనేత వార్నింగ్
- సమావేశం ఎజెండా నుంచి నీళ్ల అంశం తొలగింపు
- అవమానంపై అధిష్ఠానానికి ఫిర్యాదుచేసిన మంత్రి

> ఇది కేవలం లోకల్ బాడీ ఎలక్షన్లు వస్తున్నయి కాబట్టి.. కేసీఆర్ డైరెక్షన్ మేరకు తెలంగాణ సెంటిమెంటు పెంచనీకే ఆ మంత్రి చేస్తున్న పని! ఇయ్యాల తెలంగాణ సెంటిమెంట్‌ను లేపుదామని బనకచర్లను ముందుకు తెచ్చి బీజేపీపై బురదజల్లుతున్నరు. అసలు తెలంగాణకు ఎన్ని నీళ్లు కావాలె? రిక్వైర్‌మెంట్ ఏంది? ప్రాజెక్టుల ప్రణాళికేంది? ఫండ్స్ ఏడికెళ్లి తెస్తరు? అనేదాని మీద ఆ మంత్రికి అవగాహనే లేదు.
> – సదరు మంత్రిపై బీజేపీ ఎంపీ చేసిన వ్యాఖ్యలివి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : ఆయన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి ఒకప్పుడు పెద్దదిక్కు.. ప్రస్తుతం సీనియర్ మంత్రి.. ఉన్న మంత్రుల్లో కాస్త ఉత్తముడని, అధిష్ఠానానికి సన్నిహితుడని కాంగ్రెస్ వర్గాల్లో పేరున్నది. కానీ..ముఖ్యనేత రాజకీయ ఉచ్చులో ఆయన కూడా చిక్కుకున్నారు. తనకు పోటీ వస్తారేమోనని భావించినవారిని అధిష్ఠానం ముందు అసమర్థులుగా చిత్రీకరిస్తున్న ఆ ముఖ్యనేత.. సదరు మంత్రిపైనా 'బీఆర్ఎస్ కోవర్టు' అనే ముద్ర వేశారట! 'మీరు ఉత్తములు కారు' అని ముఖం మీదే అన్నారట! అంతేకాకుండా వ్యతిరేక పార్టీలో తన అనుయాయుడిగా ఉండి.. అధికార పార్టీ వదిలి కేవలం ప్రతిపక్ష బీఆర్ఎస్‌నే టార్గెట్ చేస్తూ విమర్శలు చేసే ఓ ఎంపీని పురమాయించి మరీ ఆ మంత్రిపై ఆరోపణలు గుప్పించి అబాసుపాలు చేయించినట్టు కాంగ్రెస్ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అంశాలను, డాక్యుమెంట్లను బీఆర్ఎస్ నేతలకు చేరవేస్తున్నారన్న ఆభియోగం సైతం మోపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశానికి ముందు ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడినట్టు సమాచారం. ముఖ్యనేత వ్యవహారశైలితో కంగుతిన్న సదరు సీనియర్ మంత్రి, తనకు జరిగిన అవమానంపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

ఎజెండాలో పెట్టి..

ఈ నెల 5న మంత్రివర్గ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ భేటీలో కాళేశ్వరమే ప్రధాన ఎజెండా అని ప్రభుత్వం లీకులు ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల కేంద్రంగా సమావేశం జరుగుతుందని ప్రచారం చేశారు. ఎన్డీఎస్ఏ నివేదికపై చర్చను ఎజెండాలో కూడా చేర్చినట్టు సమాచారం. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు నివేదికలను సిద్ధం చేసుకున్నారని, దాదాపు ఐదారుగంటలు సచివాలయంలో వేచి చూశారని ఇరిగేషన్ వర్గాలు తెలిపాయి. కానీ చివరి క్షణంలో ఈ అంశాన్ని ఎజెండా నుంచి తొలగించారని విశ్వసనీయ సమాచారం. సమయాభావం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చించలేదని ప్రచారం చేశారు. కానీ అసలు కారణం వేరే అని, సీనియర్ మంత్రి మీద అనుమానం వల్లే ఎజెండా నుంచి తొలిగించారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

యోజనం లేదని తీసేసి..

మంత్రివర్గ సమావేశం ప్రారంభం కావడానికి గంట ముందు సీనియర్ మంత్రితో ముఖ్యనేత దాదాపు 45 నిమిషాలు భేటీ అయినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఒక రికొకరు పరస్పర విరుద్ధ ఆరోపణలు చేసుకున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లు కేసీఆర్ చేతికి వెళ్తున్నాయని, ఆయనకు చేరవేస్తున్న వారు ఎవరంటూ సీనియర్ మంత్రిని ముఖ్యనేత నిలదీసినట్టు తెలిసింది. మంత్రివర్గ సహచరుల్లో ఐక్యత లేకపోవటం వల్లే ప్రజల్లో ప్రభుత్వం చులకనైపోతుందని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నేతలకు మనం సహకరిస్తున్నాం కాబట్టే కాళేశ్వరం కమిషన్ విచారణ అనుకున్న విధంగా సాగడం లేదు' అని అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. 'మనం ప్రతిపక్షాల మీద ఎక్కు పెట్టిన గన్నును.. వారు మన వైపే తిప్పి కాలుస్తున్నారు' అని గట్టిగానే అన్నట్టు తెలిసింది. ప్రభుత్వం దగ్గర ఇంత దారుణమైన పరిస్థితులు పెట్టుకొని కాళేశ్వరం మీద చర్చించినా ప్రయోజనం లేదని వాపోయినట్టు సమాచారం. అందుకే ఈ అంశాన్ని మంత్రివర్గ సమావేశం ఎజెండా నుంచి తొలిగిస్తున్నామని సదరు మంత్రి ముఖం మీదనే ముఖ్యనేత చెప్పినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధిష్ఠానికి ఫిర్యాదు..సోనియాకు లేఖ

ముఖ్యనేత ఆరోపణలతో సదరు మంత్రి తీవ్ర ఆందోళనకు గురైనట్టు తెలిసింది. గతంలోనూ ధాన్యం టెండర్లు, ఎగుమతుల పేరుతో తనపై తప్పుడు ఆరోపణలు చేయించారని సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం. ఏకంగా రూ.వేల కోట్ల కుంభకోణమంటూ ఢిల్లీ పెద్దలకు చేరవేశారని ఆవేదన వ్యక్తం చేశారట! తాజాగా తనపై కోవర్టు ముద్ర వేశారని వాపోయినట్టు సమాచారం. ముఖ్యనేత నుంచి ఊహించని ఆరోపణలు రావడంతో మంత్రి కాసేపు సైలెంట్‌గా ఉన్నా, ఆ తర్వాత ఘాటుగా బదులిచ్చినట్టు చెప్పుకొంటున్నారు. తాను నికార్సయిన కాంగ్రెస్ నేతనని, పదవుల కోసం పార్టీలు మారి రాలేదని ఎదురుదాడికి దిగినట్టు తెలిసింది. 'ప్రతిపక్షాలకు లీకులు ఇచ్చేంత ఖర్మ నాకేం పట్టలేదు.. మీలాంటి వాళ్లు ఈ పార్టీ కాకుంటే ఇంకో పార్టీకి వెళ్తారు.. నేను అలాంటి వాడిని కాదు' అని ఘాటుగానే బదులిచ్చినట్టు సమాచారం. లీకులు ఇచ్చినట్టు ఆధారాలు చూపించకపోతే తీవ్ర పరిణాలు తప్పవని హెచ్చరించినట్టు చర్చ జరుగుతున్నది. తనకు జరిగిన ఈ అవమానంపై ఆయన ఏకంగా ఏఐసీసీ పెద్దలకు, కాంగ్రెస్ అగ్రనేతలకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వ్యక్తిగతంగా సోనియాగాంధీకి లేఖ రాసినట్టు ఆ పార్టీ నేతలే చెప్తున్నారు. మొత్తంగా మంత్రివర్గం ఏర్పడినప్పుడు ఉత్తముడిగా పేరొందిన సదరు మంత్రి ఇప్పుడు ముఖ్యనేత అణచివేతతో ఉత్తర కుమారుడిలా మారిపోయారని ఆయన సన్నిహితులు వాపోతున్నారు.

మల్కాజిగిరిలో చెల్లని మైనంపల్లి

గజ్వేల్‌లో చెల్లుతవా..?

- గజ్వేల్‌లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న మైనంపల్లి
- కార్యకర్తలు ఒక్కసా తిరగబడితే గజ్వేల్‌లో అడుగుపెట్టవ్
- త్వరలోనే అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక
- సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ నాయకుల మండిపాటు

గజ్వేల్, జూన్ 19: ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాటో తెలియని, రెండు సీట్లు ఇస్తే కాంగ్రెస్‌లోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గజ్వేల్‌లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని గజ్వేల్, కొండపాక, వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్ మండిపడ్డారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మల్కాజిగిరి, మెదక్ జిల్లాలకు పోవాల్సిన మైనంపల్లి గజ్వేల్‌కు తరుచూ వచ్చి గ్రూప్‌లను ప్రోత్సహిస్తున్నారని, ఇక్కడి కార్యకర్తలు ఒక్కసారి తిరగబడితే మరోసారి గజ్వేల్‌లో అడుగుపెట్టరని తెలిపారు. మల్కాజిగిరిలో చెల్లని రూపాయి గజ్వేల్‌లో చెల్లుతుందా అన్ని ప్రశ్నించారు. ఇక్కడి నాయకత్వం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కోసం బాగా పనిచేస్తున్నదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని ఆగం చేస్తూ.. నామినేటెడ్ పోస్టుల భర్తీకి అడ్డం పడుతున్న ఆయనపై త్వరలోనే అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీ ఎన్నికల్లో మెదక్‌లో కాంగ్రెస్‌కు ఎందుకు ఓట్లు తగ్గాయో, మల్కాజిగిరిలో మూడో స్థానానికి ఎందుకు పడిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో నామినేటెడ్ పదవుల్లో ఎవరికీ ఒక్కపైసా ఇవ్వలేదని ప్రమాణంచేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్, ఆయా మండలాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రాజు, కనకయ్య పాల్గొన్నారు.

వద్దులే రేవంత్!

మొదటిపేజీ తరువాయి...

బనకచర్ల వివాదంపై కేంద్రమంత్రులను కలిసేందుకు క్షణాల్లో అపాయింట్‌మెంట్ దొరికింది. కానీ సొంత పార్టీ నేతను కలిసేందుకు మాత్రం అనుమతి లభించలేదు. నిరుడు సైతం ఇదే పరిస్థితి. రేవంత్‌కు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దక్కలేదు. దీంతో రేవంత్‌ను దూరం పెట్టారని ప్రచారం జరగగా, ఇద్దరం కలిసి ఉన్న ఫొటోలు ప్రదర్శించాల్సిన అవసరం లేదని వివరణ ఇస్తూ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ఆన్‌లైన్ వేదికగా మరోసారి అంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి మాత్రం ఢిల్లీలోనే రోజంతా పడిగాపులు కాసినా అపాయింట్‌మెంట్ దొరకకపోవడంపై కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.

కాదనరని అనుకున్నారు.. కానీ కాదన్నారు

రేవంత్‌రెడ్డి ఏడాదిన్నరగా ప్రతి రెండు వారాలకు ఒకసారి ఢిల్లీకి వెళ్తున్నారు. కాంగ్రెస్ పెద్దలను కలుస్తున్నారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు సులభంగా

దొరుకుతున్నాయి. కానీ ఎంత ప్రయత్నించినా రాహుల్ గాంధీని కలిసే అవకాశం లభించడం లేదన్నది బహిరంగ రహస్యం. పథకాల ప్రారంభోత్సవాలకు పిలిచినా, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరకు ఆహ్వానించినా, చివరికి సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించాలని కోరినా రాహుల్ పట్టించుకోలేదని చెప్తున్నారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ ముందు కులగణనపై ప్రజెంటేషన్ ఇచ్చానని రేవంత్‌రెడ్డి చెప్పుకున్నా, ఒక్క ఫొటో కూడా బయటికి రాలేదు. దీంతో రాహుల్, రేవంత్ మధ్య దూరం ఎందుకు పెరిగిందనే చర్చ ఇంటా, బయట తీవ్రంగా జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా రాహుల్ గాంధీని కలవాలని సీఎం డిసైడ్ అయినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. అందుకే గురువారం రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఆయనను కలిసి, శుభాకాంక్షలు చెప్పి, ఫొటో దిగి, సోషల్ మీడియాలో వైరల్ చేయాలని రేవంత్ భావించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. తమ ఇద్దరి మధ్య గ్యాప్ ఉన్నదనే ప్రచారాన్ని ఆపడానికి పుట్టినరోజే సరైన సమయమని భావించి 46వ ఢిల్లీ పర్యటనను ప్లాన్ చేసుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పుట్టిన రోజున అపాయింట్‌మెంట్ అడిగితే కాదు అనరని రేవంత్ భావించగా.. రాహుల్ మాత్రం కాదనేసినట్టు ఢిల్లీ కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. పలురాష్ట్రాలకు చెందిన 24 మంది కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలను రాహుల్‌గాంధీ కలిసినట్టు తెలిసింది. ఢిల్లీలో కీలక కాంగ్రెస్ నేత ద్వారా ప్రయత్నించినా రేవంత్‌రెడ్డికి మాత్రం నో చెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది. తనకు పిలుపు అందుతుందని సీఎం గురువారం రాత్రి వరకు వేచి చూసినట్టు చెప్తున్నారు. ఇటీవలే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కుటుంబంతో సహా కలిసినప్పుడు కూడా రేవంత్ ఢిల్లీలోనే ఉన్నా, రాహుల్ అనుమతించని సంగతి తెలిసిందే. ఇన్నాళ్లూ రాహుల్‌కు, తనకు గ్యాప్ లేదని దబాయించి చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎలా కవర్ చేసుకుంటారనే చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జరుగుతున్నది.

ఢిల్లీలోనూ అదే 'స్కూల్'

రేవంత్‌రెడ్డిపై బీజేపీతో సన్నిహితంగా ఉంటున్నారనే అపవాదు కాంగ్రెస్‌లో ఉన్నది. అగ్నిలో ఆజ్యం పోసినట్టు ఏదో ఒక రకంగా బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతూనే ఉన్నారు. ఇటీవలే తాను టీడీపీ స్కూల్, బీజేపీ కాలేజీ అంటూ సీఎం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తాజాగా ఢిల్లీలో మరోసారి 'స్కూల్' అంశం తెరమీదికి వచ్చినట్టు సమాచారం. గురువారం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆదిలాబాద్ జిల్లా అంశాలపై ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌తో సమావేశం అయ్యారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రిని కలిసేందుకు సీఎం , మంత్రి ఉత్తమ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం 'వాళ్లిద్దరు(ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్‌శంకర్), నేను, జితేందర్‌రెడ్డి ఒకటే స్కూల్(టీడీపీ) నుంచి వచ్చాం' అని ఖట్టర్‌కు చెప్పినట్టు సమాచారం. దీంతో ఖట్టర్‌తో పాటు అక్కడున్న నేతలంతా నవ్వుకున్నట్టు ఢిల్లీ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌ది గందరగోళ పాలన

బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌ది గందరగోళ పాలన అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. ఖజానాను ఖాళీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. తమ పాలన వైఫల్యాలను ఎన్నో రోజులు దాచలేరని విమర్శించారు. కాంగ్రెస్ పాలన వైఫల్యానికి తెలంగాణ రాష్ట్రమే చక్కటి ఉదాహరణ అని పేర్కొన్నారు. మోసపూరిత హామీలు, ఖజానాను ఖాళీ చేయడం, హామీల అమలులో చేతులెత్తేయడం.. ఇవే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు.

మహిళా సంఘాలకు 381 డ్రోన్లు : తుమ్మల

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2025-26కు సంబంధించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి, వాటిని సబ్సిడీపై రైతులకు అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 'నమో డ్రోన్ దీదీ' కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు అందించాలని సూచించారు. వానకాలం సీజన్‌కి నెలవారీగా కేంద్రం కేటాయించిన ఎరువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 1,55,257 టన్నులు జొన్నలను సేకరించామని, ఇప్పటికే రూ.302 కోట్లు రైతులకు చెల్లించామని, మిగిలిన బకాయిలను కూడా చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ధరల కమిషన్‌కు సంబంధించిన దక్షిణ ప్రాంతీయ సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని మారిగోల్డ్ హోటల్లో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

వ్యవసాయంలో ఏఐ టెక్నాలజీ

గురువారం నెదర్లాండ్ కంపెనీ ఏఆర్ఐ క్యూటీ ప్రతినిధులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణ సూచనలు ఇవ్వడం వంటి సౌకర్యాలు కల్పిస్తామని నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు.

టీజీపీఎఫ్‌సీఎల్ ఎండీగా నవీన్ మిట్టల్‌కు బాధ్యతలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీపీఎఫ్‌సీఎల్)కు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రస్తుతం నవీన్ మిట్టల్ కొనసాగుతున్నారు. నిరుడు సైతం ఇంధనశాఖకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న అధికారినే మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది.

అభివాదం చేస్తున్న బీసీ సంఘాల జేఏసీ నాయకులు. చిత్రంలో తెలంగాణ బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

యాదవులను నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్

- బీసీలకు మంత్రి పదవులు ఇవ్వకపోతే తగిన బుద్ధిచెప్తాం
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ హెచ్చరిక

మామిళ్లగూడెం, జూన్ 19: యాదవుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని తెలంగాణ బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డీ రాజారాంయాదవ్ విమర్శించారు. రాష్ట్రంలో యాదవులు, మున్నూరు కాపులు, ఎంబీసీలకు మంత్రి పదవులు ఇవ్వకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో మొదటి నుంచీ కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉన్న మున్నూరుకాపులకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. బీసీలకు మంత్రి పదవులు ఇవ్వకపోతే తగిన బుద్ధిచెప్తాం అని హెచ్చరించారు. 'బీసీల రిజర్వేషన్లు – మంత్రి పదవుల కేటాయింపు' అనే అంశంపై తెలంగాణ యాదవ మహాసభ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుమ్మా రోశయ్య అధ్యక్షతన ఖమ్మంలోని జడ్పీ మీటింగ్ హాల్లో గురువారం జరిగిన సదస్సులో రాజారాంయాదవ్ మాట్లాడారు. యాదవ జాతి నేతలైన ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్‌యాదవ్ మద్దతవ్వడం వల్లనే నాడు యూపీఏ-1, యూపీఏ-2లో కాంగ్రెస్ ప్రభుత్వం ప దేండ్లు అధికారంలో నిలబడిందని గుర్తుచేశారు. బీసీలకు మంత్రి పదవుల సాధన కోసం 30న యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు.

ఎట్టకేలకు నిర్మలకు ఇందిరమ్మ ఇల్లు

'నమస్తే' కథనంతో మంజూరు పత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

గీసుగొండ, జూన్ 19: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గరీబ్‌నగర్‌కాలనీకి చెందిన దివ్యాంగురాలు లింగంపల్లి నిర్మలకు బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక నాయకులు ఇందిరమ్మ ఇల్లు మంజూరుపత్రం అందజేశారు. తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్లిన నిర్మలను 'నీకు ఇందిరమ్మ ఇల్లు రాదు పో..!, మా ఇండ్ల మీద పడిఎందుకు ఏడుస్తున్నవ్?' అంటూ ఎమ్మెల్యే అవమానించిన విషయాన్ని 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురించింది. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి దివ్యాంగురాలికి ఇల్లు ఇవ్వాలని, లేదంటే డివిజన్‌లో ఇబ్బంది వస్తుందని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే నిర్మలకు ఇళ్లు ఇవ్వాలని ఆదేశించగా, ఇంటి మంజూరు పత్రాన్ని నాయకులు నిర్మలకు అందజేశారు.

పీఆర్సీ, హెల్త్‌కార్డులను ఇవ్వాలి

- టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్
- యాదగిరిగుట్టలో ప్రధాన ఆలయాల ఉద్యోగుల జేఏసీ ముఖ్య సమావేశం

యాదగిరిగుట్ట, జూన్ 19: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులకు పీఆర్సీ, హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ప్రధాన దేవాయాలైన యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసర దేవస్థాన ఉద్యోగ జేఏసీ ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. 888 జీవోలో ఉన్న దేవాలయాల పోస్టులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సవరణ చేయాలని సూచించారు. జీవో 261 సవరణ చేయడంతోపాటు, విరమణకు దగ్గరలో ఉన్న, అనారోగ్యంతో బాధపడుతున్న, చిన్న క్యాడర్ ఉద్యోగులను మాతృ సంస్థలకు బదిలీ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, టీజీవో జేఏసీ చైర్మన్ మందాడి ఉపేందర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇజ్జత్ ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి

- కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ సవాల్
- కేసీఆర్ మంత్రిపదవులిస్తే బీఆర్ఎస్‌ను భ్రష్టుపట్టించారని వ్యాఖ్య
- ఇప్పుడు కాంగ్రెస్‌ను ఆగమాగం చేస్తున్నరని తీవ్ర మండిపాటు

పోచమ్మమైదాన్, జూన్ 19: 'ఇజ్జత్ ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి' అని కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ సవాల్ విసిరారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా వరంగల్ పోచమ్మమైదాన్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండా మురళీ మాట్లాడారు. సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేశానని చెప్పుకొని తిరిగిన నాయకులు గతంలో వారు పనిచేసిన పార్టీలను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. 'నిన్న.. కేసీఆర్ మంత్రి పదవి ఇస్తే బీఆర్ఎస్ పార్టీని భ్రష్టుపట్టించారు. అంతకుముందు చంద్రబాబును భ్రష్టుపట్టించి.. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి పార్టీని ఆగం చేస్తున్న నాయకుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నా' అంటూ ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం మంత్రి పదవి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. వారి చర్యలతో పార్టీకి, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి 'పరకాలలో దరిద్రమైన నాయకుడు.. 75 ఏండ్ల ముసలోడు వచ్చిండు. ఆనాడు నా రెండు కాళ్లు పట్టుకుండు. నన్ను ఒక్కసారి గెలిపించమని బతిలాడితే ఎమ్మెల్యేను చేసినం' అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పరకాలలో తన కూతురు సుష్మిత ఎమ్మెల్యే అవడం ఖా యమని పేర్కొన్నారు. తానూ ఎమ్మెల్సీ అవుతానని చెప్పారు. మంత్రి కొండా సురేఖ వ రంగల్ తూర్పులో ఉంటారని స్పష్టం చేశారు.

సీపీ ఆదేశాలు పోలీసులు బేఖాతర్

- వరంగల్ తూర్పు జిల్లా పోలీసుల అత్యుత్సాహం
- చార్జీ మెమోలు లెక్కచేయకుండా కాంగ్రెస్ నేతలకు సేవలు..!
- మళ్లీ కొండా మురళికి ఎస్కార్ట్‌గా వెళ్లిన ఇద్దరు ఎస్సైలు

సుబేదారి(హనుమకొండ), జూన్ 19: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాలను స్థానిక పోలీసులు బేఖాతర్ చేస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నేత కొండా మురళికి ఎస్కార్ట్‌గా వెళ్లిన పోలీసులకు ఆయన ఇటీవలే సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. తాజాగా గురువారం కూడా ఇదే రీతిలో పోలీసులు వ్యవహరించడం చర్చనీయాంశమైంది. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ సెంటర్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హాజరయ్యారు. హనుమకొండ రాంనగర్‌లోని ఆయన ఇంటి నుంచి ఇద్దరు ఎస్సైలు మురళికి ఎస్కార్ట్‌గా వచ్చారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో కొండా మురళికి ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు షుకూర్, తుమ్మ గోపీరెడ్డి, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వచ్చారు. అక్కడ కార్యక్రమం ముగిసే గంటన్నర వరకు ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు